క్లుప్తంగా

వరిపైరులో జింకు లోపం

అట్లూరు : వరిపైరులో జింకు లోపం అధికంగా ఉందని మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య తెలిపారు. గురువారం పలు గ్రామాలలోని వరి పైరును రైతులతో కలసి ఆయన పరిశీలించి మాట్లాడారు. మాగాణి భూములలో సాగులో ఉన్న వరిపైరు కంటే బోరుబావుల కింద సాగు చేసిన వరిపైరులో జింకు లోపం అధికంగా ఉందన్నారు. యూరియాతో పాటు ఎకరాకు 20 నుంచి 25 కిలోల (ఎంఓపి)పోటాష్ చల్లుకోవాలన్నారు. అలాగే నీరు అధికంగా పెట్టకుండా తగ్గించాలని సూచించారు. ఆయన వెంట హార్టికల్చర్ అసిస్టెంటు రామమోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం డిగ్రీ థర్డ్ ఇయర్ విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించారు. కోడ్ వర్క్స్ సౌజన్యంతో బెంగళూరుకు చెందిన స్కిల్ ఇంటర్న్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించారు. మొత్తం 34 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.5.2 లక్షల ప్యాకేజీ ఇస్తారని కళాశాల కరస్పాండెంట్ ఎ.హరినారాయణ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి యువతకు ఉద్యోగం విలువ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపాల్ శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ్మోహన్ పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి చేయాలి



గాంధీని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీల సంక్షేమానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గాంధీతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ బీసీల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. బీసీల ఐక్యతకు, పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ప్రొద్దుటూరు : జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ హెల్మెట్ వాహనదారులకు శౌరాధార్యమని తెలిపారు. రహదారి సూత్రాలు డ్రైవర్లు పాటించాలని పేర్కొన్నారు.


ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని ముక్తియార్ ఆయిల్ మిల్ వద్ద సోములవారిపల్లె పంచాయతీ ఒకటో ఎంపీటీసీ గోటూరు బాల గుర్రమ్మ వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైస్ సర్పంచ్ మార్తల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, సెల్ సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కూలిన వంతెన



మడేరు వంకపై కూలిన వంతెన

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం మండలం చౌదరివారిపల్లె-పలుగురాళ్లపల్లె మధ్య మడేరు వంకపై ఉన్న వంతెన శుక్రవారం సాయంత్రం కూలిపోయింది. బ్రహ్మంసాగర్ నుంచి వచ్చే నీటితో ఏర్పడిన వంకపై 30 ఏళ్ల కిందట ఈ వంతెన నిర్మించారు. శిథిలావస్థకు చేరిన వంతెన శుక్రవారం ఉన్నట్టుండి కూలిపోవడంతో రెండు గ్రామాల మధ్యేగాక, బద్వేల్-బ్రహ్మంగారిమఠం-పోరుమామిళ్ల మధ్య రాకపోకలు స్తంభించాయి.

బాలికలు ఎందులోనూ తక్కువకాదు



ప్రొద్దుటూరు : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు



చాపాడు : దువ్వూరు జెడ్పీ హైస్కూల్‌లో..



బి.కోడూరు : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : బాలికలు ఎందులోనూ తక్కువ కాదని ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా రాజబాట వీధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్షీణిస్తున్న లింగ నిష్పత్తి సమస్యపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం బాలికలను రక్షిద్దాం బాలికను చదివిద్దాం అనే కార్యక్రమంతో పాటు కస్తూర్బా పాఠశాలలను నెలకొల్పినట్టు తెలిపారు. బాలికల విద్యను ప్రోత్సహించాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే సంబంధిత నిర్వాహకులు, రేడియాలజిస్టు శిక్షర్హులు అవుతున్నారని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నజీర్‌బాషా, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రెడ్డి, సూపర్‌వైజర్లు జయమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, ఏఎన్‌ఎం సుశీల, ఉపాధ్యాయులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో

జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శ్రీనివాస నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని డ్రైవర్ కొట్టాలలో బాలికల ప్రాముఖ్యతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పద్మినీ, మోహన్‌కాంత్ మాట్లాడుతూ ఆడ, మగ అనే తేడా చూపరాదన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చాటుతున్నారని చెప్పారు. హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ జ్యోతిలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సీతామహాలక్ష్మి, ఆశా కార్యకర్త జానకి, బాలికలు, స్థానికులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రొద్దుటూరు రూరల్ : బాల్య వివాహాలను అరికట్టాలని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని దొరసానిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలను పుట్టనిద్దాం, వారికి భద్రత, స్వేచ్ఛా జీవితాన్ని అందిద్దామన్నారు. బాలికలందరు ఉన్నత విద్యను అభ్యసించాలని, మంచి ఆరోగ్య అలవాట్లను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మీ, ఉపాధ్యాయులు లక్ష్మిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, బీపీ వరప్రసాద్, సీహెచ్‌ఓ దివ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త సుప్రజ, అంగన్‌వాడీ కార్యకర్త ఉమాదేవి పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతో ఆరోగ్యానికి రక్ష

ప్రొద్దుటూరు : ఆహారపు అలవాట్లు, వ్యాయామమే ఆరోగ్యానికి రక్ష అని ఐఎంఏ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ త్యాగరాజరెడ్డి తెలిపారు. స్థానిక వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఎక్కువగా రక్తహీనత, దృష్టిలోపం, ఎముకల బలహీనతతో బాధపడుతున్నారన్నారు. తినే ఆహారంలో ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ఐఎంఏ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాయిప్రసాద్ మాట్లాడుతూ బాలికలు చదువు, ఆటల్లో పడి నీళ్లను తాగడం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వాటర్ బాటిల్ వెంట తెచ్చుకుని బడిలో ఉండగానే రెండు లీటర్లను నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ సమిత, ఇన్‌చార్జి హెడ్మాస్టర్ నాగార్జునరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక కొర్రపాడు రోడ్డులోని అంగన్ వాడీ కేంద్రంలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ హెడ్మాస్టర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్.రమాదేవి, వై.ఎల్లమ్మ, ఎం.గౌహర్, జి.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయురాలు ఉషారాణి పాల్గొన్నారు.

దువ్వూరు హైస్కూల్‌లో బేటీ బచావో.. బేటీ పడావో

దువ్వూరు(చాపాడు) : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికా సంరక్షణ, భ్రూణ హత్యలు, చదువు, భవిష్యత్తు, బాల్య వివాహాల వలన కలిగే అనార్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు అయేషా, సునీత, కవిత, చంద్రలీల, రుహనోబి, తిరుమలదేవి, సుభద్రమ్మ, ప్రసన్న, విమల తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

బద్వేలు అర్బన్ : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకత పొందవచ్చని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. 2008లో మహిళా అభివృద్ధి మంత్రిత్వశాఖ తొలిసారిగా జాతీయ బాలికల దినోత్సవం అమలు చేసిందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో భ్రూణ హత్యలు పెరిగిపోతున్నాయని, దీనిని నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, ఏఎన్‌ఎం చెన్నమ్మ, ఆశా కార్యకర్త అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఉర్దూ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయనగర్ మహిళా సంరక్షణ కార్యదర్శి మీనా మాట్లాడుతూ విద్య, ఆరోగ్య సంరక్షణ గురించి వివరించారు.

విద్యార్థుల మరణాలపై విచారణ జరిపించాలి



ప్రొద్దుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు : రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పీటీఎల్‌యూ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనంతపురంలోని నారాయణ జూనియర్ కాలేజీలో చరణ్ అనే విద్యార్థి హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి దూకి మృతి చెందాడని ఆయన పేర్కొన్నారు. గత వారంలో విజయవాడలోని శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం ఫీజు కట్టలేదని విద్యార్థిని బయటకు పంపిందని తెలిపారు. ఒత్తిడితో చదువులు చదవలేక విద్యార్థులు, చదువులు చెప్పలేక ప్రైవేట్ అధ్యాపకులు ప్రాణాలు తీసుకుంటున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పీటర్ మాట్లాడుతూ అనంతపురంలో నారాయణ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి బాయ్స్ హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి దూకి చనిపోయాడన్నారు. ఈ సంఘటనపై విచారణ చేసి కాలేజీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాహుల్, నాని, టోని, చార్లెస్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతో ప్రాణాలకు ముప్పు



మాట్లాడుతున్న ఎంవీఐ హేమకుమార్

ప్రొద్దుటూరు క్రైం : ట్రాఫిక్ నిబంధనలు పాటించపోవడంతో పాటు అతివేగంగా వాహనాలు నడపడం వలన ప్రమాదాల బారిన పడి విలువైన ప్రాణాలను కోల్పోవాల్సివస్తోందని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజీలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల్లో వేగంగా వెళ్లడంతోనే యువకులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువకులు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని వాహనాలు నడపాలని సూచించారు. బైక్‌లో ప్రయాణం చేసేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎంవీఐ హేమకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



ఆర్టీఓ మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు : నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరికుమార్, విశ్వనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీఓ మురళీధర్‌కు వారు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల బస్సులను ఇష్టానుసారంగా నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. పట్టణంలో స్కూల్స్, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీలకు చెందిన బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్నాయన్నారు. అనుభవం లేని డ్రైవర్లతో బస్సులను నడుపుతుండటంతో ఇటీవల చాలా ప్రమాదాలు జరిగాయని తెలిపారు. రవాణా శాఖాధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు చిన్న, రమేష్ పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల ఆకస్మిక తనిఖీ



గోపవరంలో జీవామృతం తయారు చేసే విధానాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : మండలంలోని గోపవరం, సంగసముద్రం, బేతాయపల్లె, ఎస్.రామాపురం, టీ.సండ్రపల్లె రైతుసేవా కేంద్రాలను శుక్రవారం బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇ-పంట నమోదు, రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల నిల్వలు, ఇంకా అవసరమైన ఎరువులు తదితర అంశాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రైతుసేవాకేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సలహాలు, సూచనలతో పాటు వారికి మెరుగైన సేవలందించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో సాగైన వివిధ పంటలను పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం రైతులు దృష్టి సారించాలని, జీవామృతం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. వరిపంటకు వ్యాపించే తెగుళ్ళు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు విజయకుమార్, బాదుల్లా, రైతులు పాల్గొన్నారు.

గాయపడిన వారిని ఆసుపత్రుల్లో చేర్పించండి

బద్వేలు : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని స్థానికంగా ఉన్నవారు వెంటనే ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటు కోవాలని బద్వేలు గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగిన గంటలోపు గాయపడిన వారికి ఆస్పత్రికి తరలించిన వారికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గుడ్ సమరిటన్ చట్టం కింద రూ.5 వేలు నగదుతో పాటు వారికి ప్రశంసాపత్రం అందిస్తారన్నారు. సకాలంలో వైద్యం అందక రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు 50 శాతం మంది మృతి చెందుతున్నట్లు తెలుస్తోందన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రిలో చేర్పిస్తే ఎక్కడ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందోనన్న భయంతో చూసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని అలాంటి అపోహలు వీడి ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు.

ఇంటి అద్దె ఇవ్వకుండా వేధిస్తున్నాడు

వృద్ధుడు పందిటి సుదర్శన్ ఆవేదన



మాట్లాడుతున్న వృద్ధుడు సుదర్శన్

ప్రొద్దుటూరు రూరల్ : నాలుగేళ్లుగా తన ఇంటిలో బాడుగకు ఉంటూ అద్దె ఇవ్వకుండా తన తమ్ముడి కుమారుడు సుబ్బరాయుడు వేధిస్తున్నాడని పందిటి సుదర్శన్ అనే వృద్ధుడు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని దొరసానిపల్లెలో తన ఇంటి వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ తన తమ్ముడు పందిటి సిలాస్ నాలుగేళ్ల కిందట కొడుకు వివాహం కోసమని తన ఇంటిని అద్దెకు తీసుకుని అద్దె ఇవ్వకుండా, ఖాళీ చేయకుండా తనను వేధిస్తున్నాడన్నారు. తన ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందని, వైద్యం చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నానని వాపోయాడు. ఇల్లు ఖాళీ చేయకపోగా తనపై దౌర్జన్యానికి దిగుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్ని మార్లు అడిగినా ఇల్లు ఖాళీ చేయకపోవడంతో తామే ఇంటిలోని సామాన్లను బయట పెట్టామని, రూ.2లక్షలు పోయాయని తనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. పోలీసు అధికారులు పూర్తి స్థాయిలో విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పూర్తయిన రామాలయ నిర్మాణం



నక్కలదిన్నెలో నిర్మించిన రామాలయం

చాపాడు : మండలం పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ సీతారామా దేవాలయం పునఃనిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 6, 7, 8వ తేదీలలో శ్రీ సీతారామలక్ష్మణ సమేత హనుమత్ విగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది దేవదాయ, ధర్మదాయ శాఖ రూ.30లక్షలు మంజూరు చేయగా, శెట్టిపల్లె కుటుంబీకులు, ప్రజల సహకారంతో మరో రూ.35లక్షలు సమకూరగా రూ.65లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఆలయ ప్రతిష్ఠ వేడుకలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 6న ఆలయ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభమై 7న పూజా, హోమ కార్యక్రమాలు, 8న సీతారామ లక్ష్మణ సమేత హనుమత్ విగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమంతోపాటు సీతారాముల కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షులు పేర్కొన్నారు.

రేపు రైల్వే ఉద్యోగాలపై ఉచిత నమూనా పరీక్ష

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నెహ్రూ రోడ్డులోని సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు ఆర్ఆర్‌బీ గ్రూప్-డీ ఉద్యోగాలకు సంబంధించి ఉచిత నమూనా పరీక్ష, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సుజన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు, ద్వితీయ స్థానం నిలిచిన వారికి రూ.2 వేలు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8099919877 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల 11 కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతు పనులు జరుగుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని డీఈఈ రవి చంద్రశేఖర్ తెలిపారు. పోరుమామిళ్ల, కాశినాయన, బి.కోడూరు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలుపుతున్నామన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

దుప్పట్లు పంపిణీ

పోరుమామిళ్ల : పట్టణంలోని బ్లెస్డ్ బ్రయాన్ అనాథాశ్రమం, ఓఎల్ఎఫ్ అర్ఫనేజ్ హోమ్‌లో ఉంటూ చదువుకుంటున్న 280 మంది బాలికలకు శుక్రవారం చిత్తా శౌరిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎఫ్‌సీఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు ప్రసాదరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ రవి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల బస్టాండు పరిశీలన

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండును శుక్రవారం బద్వేలు డీఎం నిరంజన్ పరిశీలించారు. బస్టాండులో ప్రయాణికుల వసతుల గురించి విచారించారు. బస్టాండు ఆధునీకరణలో భాగంగా ఆయన పోరుమామిళ్ల వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బోస్, రీజనల్ నాయకులు నాగరాజు, కంట్రోలర్ జమాల్ పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలో మాజీ సైనికులు పాల్గొనాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలో సైనికులు, మాజీ సైనికులు, వీర నారీమణులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొనాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు నేట్ల బాలవీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిఫెన్స్ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ప్రొద్దుటూరు డివిజన్ తరపున జెండా వందనం ఉంటుందని, ఉదయం 7.30 గంటలకల్లా మున్సిపల్ మైదానానికి చేరుకోవాలని ఆయన పేర్కొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ పర్యటించారు. జోక్‌పాలెం వీధిలో కాలువలో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. రాజీజీరోడ్డు, మోక్షగుండం వీధి ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెయిన్ బజార్, రాజబాట వీధిలో ఉన్న షాపులకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయాలని, లేని వాటికి కొత్తగా ట్రేడ్ లైసెన్స్‌లను విధించాలని వార్డు శానిటేషన్ సెక్రటరీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.గోవిందరెడ్డి, ఎం.సునీత పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



త్యాగరాజస్వామిని ఊరేగిస్తున్న నాయీబ్రాహ్మణులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో శుక్రవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గంగమ్మ దేవాలయం వీధి రామాలయం వద్ద నుంచి త్యాగరాజ స్వామి చిత్రపటాన్ని పురవీధుల్లో మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల్‌కు చెందిన సన్నాయి మేళం వాయిద్యకారులు, చాపాడు మండలం అల్లాడుపల్లెకు చెందిన కళాబృందం ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం అనంతరం బీసీ నాయకుడు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు వీరయ్య, వీరశేఖర్, వెంకటేష్, చిన్న, వెంకట్, పవన్, ప్రసాద్, మోరగుడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

బద్వేలు అర్బన్ : స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలోని శ్రీకనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. అమ్మవారి విగ్రహాన్ని సుందరంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి గణపతిపూజ, పుణ్యావచనం, అభిషేకములు, కుంకుమార్చనలు నిర్వహించి అనంతరం చండీహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గుడి ఉత్సవం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం మహాపుష్ప యాగం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు ప్రదీప్‌కుమార్‌శర్మ బ్రహ్మత్వమున నిర్వహించబడిన పూజా కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దగురువలూరులో పశు వైద్య పరీక్షలు

చాపాడు : మండల పరిధిలోని పెద్దగురువలూరులో శుక్రవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో 466 పశువులకు వైద్య పరీక్షలు చేసి చికిత్స చేసినట్లు పశు వైద్యాధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో 26 పాడి పశువులకు సాధారణ చికిత్సలు, 18 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 12 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 410 పశువులు, గొర్రెలు, మేకలను నట్టల నివారణ మందులు తాపించినట్లు పశు వైద్యాధికారి తెలిపారు. గ్రామ సర్పంచ్ రాజేష్‌రెడ్డి, పశు వైద్య సిబ్బంది శివ, సిద్దయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.

సమయం పాటించాలి

అట్లూరు : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ భాస్కర్‌బాబు తెలిపారు. మండలంలోని ముత్తుకూరు, మాడపూరు, కుంభగిరి సచివాలయాలతో పాటు ఆరోగ్యకేంద్రాలను ఆయా గ్రామాలలోని పాఠశాలలను ఆయన గురువారం సందర్శించి రికార్డులను పరిశీలించారు.

ప్రకటన

కడప జిల్లా ఖాజీపేట మండలం పత్తూరు గ్రామం లో వెలసిన శ్రీ కోదండ రామాలయంను దేవాదాయ చట్టం 30/87 ప్రకారం రిజిస్ట్రేషన్ మరియు పబ్లికేషన్ చేయుటకు ఏవైనా అభ్యంతరాలు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపు కడప లోని కడప జిల్లా దేవాదాయ అధికారి గారికి తెలియజేయగలరని దేవాదాయ ఇన్స్పెక్టర్ సి.శివయ్య ఒక ప్రకటన లో తెలిపారు.